క్లుప్తంగా

నేడు మహాపాదయాత్ర

బడంగ్‌పేట్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు బడంగ్‌పేట కార్పొరేషన్‌లో మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు గురువారం ఒకప్రకటనలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా విద్యాశాఖమంత్రి సబితారెడ్డి పాల్గొంటారని అన్నారు. అల్మాస్‌గూడలోని హనుమాన్ దేవాలయం నుంచి బడంగ్‌పేటలోని అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించి నిరసనతో కూడిన ధర్నాను, కట్టెల పొయ్యితో వంటావార్పు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొని మహా పాదయాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు.

రోడ్డు మధ్య విద్యుత్ స్తంభాలు తొలగించాలి

హుడాకాంప్లెక్స్: రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వాహనదారులకు అసౌకర్యంగా మారిందని, వెంటనే ఆ స్తంభాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఇంజినీరింగ్ అధికారులకు సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సూచించారు. గురువారం సరూర్‌నగర్ డివిజన్ చౌడీ ప్రాంతంలో దారి మధ్యలో ఉన్న స్తంభాన్ని ఏఈ నరసింహశెట్టితో కలిసి సందర్శించారు. వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు సుదర్శన్, దర్శన్, నిజాముద్దీన్, బీజేపీ నాయకులు ఆరుట్ల సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జోడో యాత్రను విజయవంతం చేయండి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లో నిర్వహించే హాత్‌సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలని గురువారం కాంగ్రెస్ పార్టీ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్నా గణేష్‌నేత ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ డివిజన్ కొత్తపేట చౌరస్తా నుంచి ఉదయం 8.30 గంటలకు గడప గడపకూ పాదయాత్ర కార్యక్రమం ఉంటుందని, కావునా, నాయకులు, కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొనాలని కోరారు.

అనాథకు దహన సంస్కారాలు



దహన సంస్కారాలు నిర్వహిస్తున్న గిరి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథ, మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో మతిస్థిమితం కోల్పోయి ఆశ్రమంలో ఉంటున్న రామ్ అనారోగ్యంతో గురువారం మరణించాడు. ఆశ్రమ నిర్వాహకుడు గట్టు గిరి అనారోగ్యంతో బాధపడుతున్న అతన్ని మెరుగైన వైద్యం కోసం కామినేని హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ చేయించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని గిరి పేర్కొన్నారు. అనాథ అయిన అతనికి అన్నీ తానై సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించారు. నాదర్‌గుల్‌లోని తోట శ్రీధర్‌రెడ్డి, ఆశ్రమ ముఖ్య సలహాదారులు వలిశెట్టి లక్ష్మీశేఖర్, దాతల సహకారంతో ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరి కుటుంబసభ్యులు పాల్గొని దహన సంస్కారాలు నిర్వహించారు.

నూతన కమిటీ నియామకం

తుక్కుగూడ: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా నూతన కమిటీని గురువారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆసంస్థ జిల్లా చైర్మన్‌గా సోలిపురం నర్సింహ్మారెడ్డి, వైస్ చైర్మన్‌గా పాండు, ట్రెజరర్‌గా చల్లా రాఘవరెడ్డి, సెక్రటరీగా రాజేందర్‌రెడ్డి, సోషల్ వర్కర్స్‌గా పండుగ అంజయ్య, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సూర్యనారాయణగౌడ్, నరేందర్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, యండీ సర్దార్, చైతన్య ఎన్నికయ్యారు.

ఆయుష్మాన్ భారత్‌లో చేరండి

ఆమనగల్లు: పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ దివ్య కోరారు. ఆమనగల్లు పట్టణంలోని 6వ వార్డు పరిధిలో గుర్రంగుట్ట వద్ద ఆయుష్మాన్‌భారత్ పథకంలో పేర్ల నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సరైన ప్రచారం లేకపోవడంతో ప్రజలు సద్వినియోగం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరాలని కోరారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి

తుర్కయంజాల్: డిమాండ్ల సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం 6వ రోజుకు చేరుకుంది. తుర్కయంజాల్‌లోని ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యాలయంలో మధ్యాహ్న విరామ సమయంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ జి.సత్యనారాయణరావు మాట్లాడుతూ.. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, 2004 వరకు విధుల్లో ఉన్న ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్, ఈపీఎఫ్, జీపీఎఫ్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పుచ్చపండు.. ఆరోగ్యం మెండు

రుచికిరుచి..
చల్లదనానికి చల్లదనం
- పుష్కలంగా పోషకాలు
- వేసవిలో భారీగా పెరిగిన డిమాండ్
- రోడ్లపై విరివిగా తాత్కాలిక దుకాణాలు



రహదారిపై పుచ్చకాయల దుకాణాలు

హుడాకాంప్లెక్స్: వేసవి ఎండలు పెరుగుతున్న కొద్దీ ప్రతి ఒక్కరూ చల్లదనాన్ని కోరుకుంటారు. ముఖ్యంగా ఎండలో ప్రయాణించే వారు దాహార్తిని తీర్చుకునే ప్రయత్నం చేస్తుంటారు. మండుటెండల్లో పుచ్చకాయ తింటే దాహార్తికి అడ్డుకట్ట వేయవచ్చు. రుచికి రుచి-చల్లదనానికి చల్లదనం ఇచ్చే పుచ్చ కాయ అంటే చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరికీ నోరూరుతుంది. పుచ్చకాయ అంటే ఇష్టపడనివారుండరు. పెరుగుతున్న ఎండలతో పుచ్చకాయ అమ్మకాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం ఎక్కడికక్కడ రహదారుల వెంబడి తాత్కాలికంగా పుచ్చకాయల దుకాణాలు వెలుస్తున్నాయి.

దండిగా విటమిన్-బి, కాల్షియం

పుచ్చకాయ వేసవి పండు. ఇందులో 82 శాతం నీరు ఉండడంతో ఇది శరీరానికి కావాల్సిన చల్లదనాన్ని ఇస్తుంది. పోషకాలు కూడా ఎక్కువే. పుచ్చకాయలో బి-విటమిన్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా లభిస్తాయి. పుచ్చకాయలో కొలెస్ట్రాల్ ఉండదు. పుచ్చకాయ తింటే తక్షణ శక్తితో పాటు శరీరానికి ఎంతో మేలు చేకూరుతుంది. పుచ్చకాయలో 82శాతం ఆల్కలైన్, నీళ్లతో పాటు పీచుపదార్థం ఉండటం వలన శరీరానికి, మూత్రపిండాలకు, మూత్రనాళాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పుచ్చకాయ తినడం వలన మలబద్ధకం తగ్గుతుంది. ఇందులో ఉండే బీటాకెరోటిన్ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కిడ్నీలో రాళ్లు ఉన్నవారికి ఎంతో ఉపయోగకరం. ఆస్తమా, మధుమేహాన్ని నివారించడంతో పాటు సక్రమంగా రక్త ప్రసరణ జరిగేలా చేస్తుంది. రక్తపోటు నివారణకు, యాంటీ ఆక్సిడెంట్, మధుమేహం కోసమే కాకుండా పుచ్చకాయ సౌందర్యానికి కూడా పనిచేస్తుంది.

రక్తపోటును తగ్గిస్తుంది



వేసవిలో పుచ్చకాయ తినడం ఆరోగ్యానికి మంచిది. వయసుతో సంబంధం లేకుండా అందరూ తినవచ్చు. చిన్న పిల్లలు ఎక్కువగా తింటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. రక్తపోటు తగ్గడంతో పాటు శరీరానికి శక్తినిస్తుంది. పుచ్చకాయలో ఉండే మెగ్నీషియం, పొటాషియం.. గుండె ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుతాయి. గుండె, కళ్లు, జీర్ణ అవయవాల పనితీరు మెరుగయ్యేందుకు సహాయ పడుతుంది.

– డాక్టర్ మాధురి, వైద్యాధికారి, సరూర్‌నగర్

ఆరోగ్య బీమా.. ఇస్తుంది ధీమా

- 'ఆయుష్మాన్' కార్డు ప్రతి ఒక్కరు తీసుకోవాలి
- బీజేపీ రాష్ట్ర నాయకుడు జంగయ్య యాదవ్

మహేశ్వరం: ప్రతి ఒక్కరు 'ఆయుష్మాన్ భారత్ యోజన' ఆరోగ్య బీమా కార్డును పొంది, ధీమా ఉండండని బీజేపీ రాష్ట్ర నాయకుడు కడారి జంగయ్య యాదవ్ చెప్పారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలూరులో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానికులకు ఆయుష్మాన్ కార్డు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ధనిక అనే తేడా లేకుండా కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ యోజన పథకం కింద హెల్త్ కార్డును ఇస్తుందని తెలిపారు. ఈ కార్డు ద్వారా రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్య చికిత్స పొందొచ్చని చెప్పారు. కార్యక్రమంలో తుమ్మలూరు ఎంపీటీసీ మద్ది రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గట్టుగళ్ల వెంకటయ్య, పార్టీ నాయకులు మద్ది సునీతారెడ్డి, అక్కెర యాదయ్య, శ్రీరాములు, రఘువీర్, శ్రీశైలం, రవి సాగర్, రామచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.



హెల్త్ కార్డుపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

పదిమందిలో ఐదుగురిని కాపాడొచ్చు

సీపీఆర్ శిక్షణ శిబిరంలో ఏసీపీ అంజయ్య



సీపీఆర్‌ను ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తున్న పోలీసులు

మహేశ్వరం: హార్ట్‌ఎటాక్ వచ్చిన బాధితుల ప్రాణాలను సీపీఆర్ చికిత్స ద్వారా రక్షించవచ్చని మహేశ్వరం ఏసీపీ అంజయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ సమావేశం హాలులో (ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్ట్యూట్) టీటీఐ ఆధ్వర్యంలో సీపీఆర్ చికిత్స గురించి పోలీస్ కానిస్టేబుళ్లు, ఆర్టీసీ, ఆటో డ్రైవర్లు, సామాజిక సేవా కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీపీఆర్ చికిత్స ఏవిధంగా చేయాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా యువకులు సైతం రెప్పపాటులో కళ్లముందే ప్రాణాలు వదులుతున్న ఘటనలు పెరుగుతున్నాయన్నారు. శారీరక శ్రమ లేకపోవడం వల్ల అనేక రోగాలు వస్తున్నాయన్నారు. ప్రస్తుత కాలంలో చాలామంది గుండెపోటుతో చనిపోతున్నారని.. ప్రజల ప్రాణాలు కాపాడాలనే లక్ష్యంతో సీపీఆర్ శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. సీపీఆర్‌తో 10మందిలో ఐదుమంది బతికే అవకాశం ఉందన్నారు. అంతకు ముందు ప్రముఖ గుండె వైద్యుడు, సీపీఆర్ ట్రైనర్ డా.జావేద్ సీపీఆర్ ఏవిధంగా చేయాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం సీఐ మధుసూదన్, నాగార్జున, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ఆర్టీసీ, ఆటో డ్రైవర్లు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ సహకారం అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. మాడ్గుల మండల కేంద్రంలోని ఈదమ్మ దేవాలయంలో గురువారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈదమ్మ ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈదమయ్య, నర్సింహ, కృష్ణయ్య, శ్రీకాంత్, వెంకటయ్య, కిరణ్, ఈశ్వర్, మోహన్, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జనార్దన్‌రెడ్డిని గెలిపిద్దాం: పీఆర్టీయూ

హయత్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి కాటిపల్లి జనార్దన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన మద్దతుదారులు గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ నాయకులు వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు పిల్లల సంరక్షణ సెలవులు, పీఆర్సీలో 30శాతం ఫిట్మెంట్ ఇప్పించేందుకు జనార్దన్‌రెడ్డి కృషిచేశారని తెలిపారు. రానున్న రోజుల్లో పండిట్, పీఈటీ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం, 317 జీఓ కారణంగా ఇతర జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామ సర్పంచ్ బల్‌రాం తల్లి పోచమ్మ బుధవారం మృతిచెందారు. గురువారం పోలెపల్లి గ్రామంలో సర్పంచ్ బాల్‌రాంను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఆమనగల్లు ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ అనురాధ, ఎంపీటీసీ దోనాదుల కుమార్, సింగిల్‌విండోవైస్ చైర్మన్ సత్యం, ఉపసర్పంచ్ అంజన్‌రెడ్డి మృత దేహానికి నివాళులర్పించారు. సర్పంచ్ బల్‌రాంను పరామర్శించారు.

277 మందికి కంటి పరీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లి, పడకల్‌లో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో బుధవారం 277 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు కల్పన, స్నేహ, సైదమ్మ తెలిపారు. దృష్టి లోపాలున్నవారికి కళ్లద్దాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు మల్లికార్జున్, హెచ్ఏ మల్లయ్య, రామచంద్రయ్య, నర్సింహ, రవికుమార్, శివకుమార్, నాగమల్లీశ్వరి ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా మాణిక్‌రెడ్డిని గెలిపించండి



జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం చేస్తున్న గోపాల్‌నాయక్

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్

మీర్‌పేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కరంటోత్ గోపాల్‌నాయక్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై మాణిక్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న మాణిక్‌రెడ్డిని గెలిపిస్తే.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుగ్గ గణేశ్, నాయకులు శంకర్‌నాయక్, పాండురంగారెడ్డి, సరూర్‌నగర్, బాలాపూర్ మండలాల అధ్యక్షుడు తావ్యానాయక్, శంకరయ్య, ప్రధాన కార్యదర్శులు మల్లేశ్, సీపీనాయుడు, నాగమణి, అంజయ్య, మస్కు జంగయ్య పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం



విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేసిన ఉప్పల వెంకటేశ్

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేశ్

ఆమనగల్లు: ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చెప్పారు. మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామంలో గురువారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ.. ట్రస్టు ద్వారా ఇప్పటివరకు రూ.25 కోట్లతో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. శిబిరంలో డా.అఖిల ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రి వైద్య బృందం 326 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల, తలకొండపల్లి ఎంపీపీలు పద్మారెడ్డి, నిర్మల, మాజీ జెడ్పీటీసీ పగడాల రవి, స్థానిక నాయకులు శ్రీశైలం, రఘుపతి, హన్మానాయక్, వెంకట్‌నారాయణ, కిశోర్, వెంకటేశ్, శ్రీను, శంకర్, బిక్కుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇర్విన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 555 మంది విద్యార్థులకు ఆమనగల్లు మండలం సింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో 70 మంది విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్సులను పంపిణీ చేశారు.

రాజీవ్ గృహకల్ప భూములను కాపాడండి

సీపీఐ జిల్లా సమితి సభ్యుడు శివకుమార్



ధర్నా చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

తుర్కయంజాల్: రాజీవ్ గృహకల్పకు సంబంధించిన భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా సమితి సభ్యులు పి.శివకుమార్ ఆరోపించారు. రాగన్నగూడలోని రాజీవ్ గృహకల్ప (జేఎన్ఎన్‌యూఆర్ఎం) కాలనీ వద్ద ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ గురువారం సీపీఐ, సీపీఎం నాయకులతో కలిసి కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు సంబంధిత భూమిలో బండలను తొలగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని.. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాజీవ్ గృహకల్ప కార్యదర్శి దుబ్బ యాదయ్య, సీపీఎం నాయకులు ప్రసాద్, కాలనీ అధ్యక్షుడు రవిదాసు, నాయకులు రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ పంకజ

జోనల్ కమిషనర్ పంకజ

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 16వ తేదీన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను గురువారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్, ఎన్నికల నమోదు అధికారి ఎస్.పంకజ పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంకజ మాట్లాడుతూ ఈ నెల13న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరగనుందని తెలిపారు. అనంతరం జరిగే లెక్కింపు ప్రక్రియకు సంబంధించి అంతా సిద్ధం చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కురుమయ్య



ధర్నాలో మాట్లాడుతున్న కురుమయ్య

ఆమనగల్లు: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఐసీడీఎస్‌కు నష్టం కలిగించే నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గుమ్మడి కురుమయ్య డిమాండ్ చేశారు. ఆమనగల్లు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె గురువారంతో రెండవరోజుకు చేరకుంది. అంతకుముందు ఆమనగల్లు పట్టణంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమయ్య మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. 2018 అక్టోబర్‌లో కేంద్రం పెంచిన వేతనాలను ఏరియర్స్ కలిపి అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, హెల్పర్లకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 2015 నుంచి ఉన్న టీఏ, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని మూడు సంవత్సరాలు రేషన్ ట్రాన్స్‌పోర్టు చార్జీలను ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలకు ఇచ్చే రూ.200ను రూ.2000కు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చిన విధంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, వసంతలక్ష్మి, శైలజ, రాజ్యలక్ష్మి, సుగుణమ్మ, సునీత, జ్ఞానేశ్వరీ, సంగీత, నిర్మల, అలివేలు, అనసూయమ్మ, గీత, విజయలక్ష్మి, కళావతి, లక్ష్మి, యాదమ్మ, అనిత పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులతో మునగనూరు అభివృద్ధి

బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి

హయత్‌నగర్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గత పదేళ్లుగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని బీఆర్ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. ప్రగతి నివేదన పాదయాత్రలో భాగంగా గురువారం ఆయన తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మునుగనూరులో పర్యటించారు. మంచినీటి బిల్లులు ఎక్కువగా ఉన్నాయని, సీసీ రోడ్లు కావాలని, అంతర్గత డ్రైనేజీ నిర్మించాలని తదితర సమస్యలు స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న మునుగనూరుకు ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని అన్నారు. కాలనీల్లో డ్రైనేజీ, రోడ్ల సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటి తలుపు తడుతున్నాయని, మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులు ఇచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు.

మహిళా ఉపాధికి సహకారం...

మర్రి మణెమ్మ ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కుట్లు, అల్లికలు, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన సుమారు 160 మంది మహిళలు ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని కలిశారు. తమకు తగిన సహాయం అందిస్తే స్వతహాగా ఉపాధి పొందుతామని కోరారు. ప్రగతి నివేదన యాత్ర తరువాత తప్పకుండా సహాయం అందిస్తామని ప్రశాంత్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. తుర్కయాంజాల మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు వేముల స్వాతి, తాళ్లపల్లి సంగీతా మోహన్‌గుప్త పాల్గొన్నారు.

మాయమాటలతో ప్రజలను మోసగిస్తున్నారు

- అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్
- హాత్ సే హాత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నేతలు



ఇబ్రహీంపట్నం: పాదయాత్రలో కోదండరెడ్డి, నాయకులు

ఇబ్రహీంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాయమాటలతో ప్రజలను మోసగిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి, జిల్లా నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నంలో గురువారం కాంగ్రెస్ శ్రేణులు పాదయాత్ర నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ హయాంలోని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పనితీరును ఎండగడుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామన్నారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మీపతిగౌడ్, నాయకులు.. శంకర్‌గౌడ్, కృష్ణ, వెంకట్‌రెడ్డి, రమేష్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, రఘు, ఉదయ్‌పాల్‌రెడ్డి, జయమ్మ, నందకిషోర్, మల్లారెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

కష్టపడే వారికే గుర్తింపు..

యాచారం: పార్టీ బలోపేతం కోసం కష్టపడే వారికే తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలతో గురువారం నగరంలోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీ కష్టకాలంలో అండగా ఉండి, బలోపేతం కోసం కృషి చేసే వారికి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గ్రామానికి చెందిన కావలి బాలయ్యను యాచారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమించారు. మల్‌రెడ్డి రంగారెడ్డి ఈమేరకు నియమాక ఉత్తర్వులు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, కార్యనిర్వాహణ అధ్యక్షుడు మోటె శ్రీశైలం, కొత్తపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండీ ఘనీ, యూత్ అధ్యక్షుడు కాలె కుమార్, నాయకులు లింగారెడ్డి, కృష్ణ, మహేందర్, మహేష్, వంశీ తదితరులు ఉన్నారు.